## క్యూఆర్ కోడ్ ద్వారా అన్న క్యాంటీన్‌లలో ప్రజల అభిప్రాయాలను సేకరించండి : కమీషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్,మార్చి 15,ప్రభాతవార్త :** క్యూ ఆర్ కోడ్ ద్వారా అన్న క్యాంటీన్‌లలో ప్రజల అభిప్రాయాలను సేకరించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన గాంధీజీ మహిళా కళాశాల వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న అన్న క్యాంటీన్‌లో క్యూ ఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ప్రజాభిప్రాయాన్ని సేకరించే ప్రక్రియను పరిశీలించారు. నగర పరిధిలో ఉన్న అన్న క్యాంటీన్లలో నోడల్‌ఆఫీసర్లు ప్రజల అభిప్రాయాలను తీసుకొని దానికనుగుణంగా క్యాంటీన్ నిర్వహణపై మెరుగైన సేవలందించేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## సెలవు రోజుల్లోను పనిచేయనున్న విఎంసి క్యాష్ కౌంటర్లు



**విజయవాడ కార్పొరేషన్,మార్చి 15,ప్రభాతవార్త:** సెలవు దినాల్లో కూడ పన్ను చెల్లించడానికి క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు.నగర ప్రజలందరూ ఆస్థి పన్ను,ఖాళీ స్థలాల పన్ను,డ్రైనేజి పన్ను,త్రాగునీటి పన్నులు చెల్లించడానికి విజయవాడ నగరపాలక సంస్థ పరిదిలోని అన్ని క్యాష్ కౌంటర్లు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 31 వరకు ప్రజలు తమ తమ అసెస్మెంట్లకు ఉన్న పన్నులు త్వరగా చెల్లించి వడ్డీ పడకుండా సకాలంలో చెల్లించాలని కోరారు. ఎక్కువ కాలం నుండి పన్నులు చెల్లించని వారికి డ్రైనేజి కనెక్షన్,త్రాగునీటి కనెక్షన్లు తొలగిస్తున్నామని, ప్రజలు దీనిని గమనించి నగరపాలక సంస్థకు చెల్లించాల్సి న పన్ను బకాయిలు త్వరగా చెల్లించాలని కోరారు.

## వినియోగదారుల హక్కులు-బాధ్యతలపై అవగాహన అవసరం



**జగ్గయ్యపేట, మార్చి 15, ప్రభాతవార్త :** వినియోగదారుల హక్కులు-బాధ్యతలపై అవగాహన అవసరమని, ప్రశ్నించే తత్వాన్ని యువత అలవర్చుకోవాలని సీనియర్ న్యాయవాది, వామపక్ష నేత జూనెబోయిన శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని విశ్వభారతి డిగ్రీ కళాశాలలో కర్లపాటి చారిటబుల్ ట్రస్టు, జగ్గయ్యపేట కన్స్యూమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సులో న్యాయవాది శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. వినియోగదారుల రక్షణ చట్టం దాని సవరణలపై అవగాహన కలిగించారు. సభకు ఎన్‌టిఆర్ జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు, ప్రముఖ సామాజికవేత్త కర్లపాటి వెంకటశ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో న్యాయవాది, అధ్యాపకులు జెల్లా తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో సమాజంపట్ల యువత అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయవాది డి కరుణాకర్ మాట్లాడుతూ ఆనై ్లన్ మార్కెటింగ్‌పై సులభతరంగా అర్ధమైయ్యేట్లు వివరించారు. సభాధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కుల గురించి తెలుసుకుని నాణ్యమైన ఉత్పత్తులు, సేవలను డిమాండ్ చేయవలసిన అవసరాల గురించి విశ్లేషించారు. కార్యక్రమంలో విశ్వభారతి కళాశాల సిబ్బంది, ట్రస్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

**నందిగామ మార్చి 15 ప్రభాతవార్త:** ప్రజారోగ్యానికి పరిశుభ్రతే మూలాధారం అని నందిగమమున్సిపల్ ఛైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ




దివాస్ -కార్యక్రమంలో భాగంగా నందిగామ పట్టణ పరిధిలో గలబాబు జగజ్జీవన్ రావు కమ్యూనిటీ హాల్ నందు సభా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ ఛైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి మాట్లాడుతూ తొలుత స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛ నందిగామలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత జీవన విధానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని , పర్యావరణహితమే ప్రధాన లక్ష్యంగా ప్లాస్టిక్ ముప్పు నుండి సమాజానికి విముక్తి కల్పిద్దామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను ఎవరు వినియోగించ వద్దన్నారు. ఇది కూడా మైక్రో ప్లాస్టిక్ గా మారి భూగర్భ జలాలను కలుషితం చేస్తుందన్నారు. ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ స్వచ్ఛ నందిగామ కార్యక్రమం ద్వారా అందరినీ చైత్య పరుద్దామని పచ్చదనం -పరిశుభ్రతతో నందిగామను అగ్రగామిగా నిలుపుదామని అని అధికారులు నాయకులతో పాటు ఆమె ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి నిషేదించిన కాకతీయ సంస్థల అధినేత కాపా రవీంద్ర వేచన ఆర్గానిక్స్ అధినేత బాలకృష్ణ రెడ్డిసాయి బాలాజీ హాస్పిటల్స్ అధినేత గాదం జయరాం కూరగాయ మార్కెట్లో చిరు వ్యాపారుల అయినటువంటి పాపట్ల అరుణ ఎం జ్యోతి దుశ్యాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డి ఓ బాలకృష్ణ కమిషనర్ ఈవీ రమణ బాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు ఏచూరి రామకృష్ణ గారు ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ ఛైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు కూటమి నాయకులు, మెప్మా సిబ్బంది మున్సిపల్ సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సేవలో పాల్గొన్న పల్నాడుజిల్లా కలెక్టరు

**రాజుపాలెం, మార్చి 15 ప్రభాతవార్త :** అందరి భాగస్వామ్యంతోనే గ్రామాన్ని పరిశుభ్రంగా తయారు చేసుకోవడం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. శనివారం నెమలిపురి గ్రామంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన అనంతరం అధికారులతో కలిసి వ్యర్థాలను ఊడ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరుగుతుందన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. వీధులను పరిశుభ్రంగా ఉంచడం పంచాయితీ బాధ్యత అని తెలిపారు. గ్రామంలోని క్లాప్ మిత్రాలకు కలెక్టర్ అరుణ్‌బాబు జనపనారుతో తయారు చేసిన సంచులను అందజేశారు. సబ్బులు, సోప్‌లు,కొబ్బరినూనె తదితర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దుర్గేశ్వరరావు, ఎంపిడిఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు ఘాతకానికి బత్తాయి తోట దగ్ధం

**విజయపురిసౌత్, మార్చి 15 ప్రభాతవార్త:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బత్తాయి తోట దగ్ధమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాచర్ల మండలం చింతలతండాకు చెందిన రైతు అంగోత్ మోతీలాల్ తన 4 ఎకరాల్లో 2018 నుంచి బత్తాయి తోట వేసి సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో మోటారు



బోరు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి బత్తాయి తోటకు అంటుకున్నాయి. హుటాహుటీన స్థానికులతో కలిసి నీళ్ల చల్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఒక ఎకరా బత్తాయి తోట పూర్తిగా దగ్ధమైందని బాధితుడు మోతీలాల్‌నాయక్ తెలిపాడు. మూడు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు.

# విజయవాడ వార్త

## పోలీసు స్టేషన్లలో స్వచ్ఛాంధ్ర,స్వచ్ఛ దివస్

**విజయవాడ క్రైం,మార్చి 15,ప్రభాతవార్త:** పచ్చదనం,పరిశుభ్రతలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం స్వఛ్ఛాంధ్ర,స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో నగర పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ పోలీస్ కమీషనరేట్ పరిధి లోని అన్ని పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛాంధ్ర,స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని అన్ని పోలీస్‌స్టేషన్‌ల లోని




పోలీసులు నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్లలో సిబ్బందిచే పోలీస్ స్టేషన్,స్టేషన్ పరిసర ప్రాంతాలను పోలీసులు శుభ్రం చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో జరగాలి : కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,మార్చి 15,ప్రభాతవార్త :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో జరగాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. శనివారం ఉదయం ఒన్‌టౌన్,పంజాసెంటర్‌లో జరిగిన స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించారని, ప్రజలు కేవలం గుడ్డ సంచులు,జూట్ సంచులను వాడాలని, 120 మైక్రోన్లకంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను పూర్తి స్థాయిలో నిలివేయాలని,అవి పర్యావరణానికి హాని కల్గిస్తామని,



భూమిలో కలవటానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని దానిని నివారించేందుకు పర్యావరణహితమైన వస్తువులనే వాడాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం,కొనడం,అమ్మడం నిషేధం పూర్తి స్థాయిలో జరగాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను డ్రైన్లో పడేస్తున్నారని, అవి మురుగు పారుదలకు ఆటంకం కల్గిస్తున్నాయని, వర్షాకాలంలో నీరు రోడ్డుపైకి చేరి ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయని, ప్రజలందరూ దీనిని గ్రహించి డ్రైన్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాలను వెయ్యకుండా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడమే కాకుండా పర్యావరణహితమైన వస్తువులను వాడుతూ తమ వంతు సహాయాన్ని చేయాలని కోరారు.సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు ఏమేమి ఉన్నాయి,ఎన్నిరకాలుగా ఉన్నాయి,వాటికి ప్రత్యామ్నాయాలు ఏమేమి ఉన్నాయి,ప్రజలు మలేరియా బారిన పడకుంఆ ఉండేందుకు కార్పొరేషన్ చేస్తున్న వివిధ కార్యక్రమాలు ఏంటి వంటి విషయాలపై అవగాహన కల్పించిన స్టాల్‌కు విచ్చేయడమే కాక,ప్రజలకు మొబైల్ వాన్ ద్వారా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వాన్ వద్ద అక్కడ పాల్గొన్న ప్రజలకు అవగాన కల్పించారు. తదుపరి ర్యాలీ ద్వారా పంజాసెంటర్‌లో ఉన్న వ్యాపారస్థులకు ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన కల్పించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కేవలం ప్రజల సహకారంతోనే జరుగుతుందని, ఇప్పటి వరకు ప్రజల సహకారంతో దేశం లోనే ఉత్తమ స్థానాలను స్వచ్ఛ సర్వేక్షన్‌లో విజయవాడ నగరపాలక సంస్థ పొందిందని, ప్రత్యేకంగా కొండ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ చేయడం ఎంతో కఠినమైన పరిస్థితి అని, విజయవాడలో అటువంటి కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నప్పటికీ పారిశుధ్య కార్మికులు నిత్యం అహర్నిశలు శ్రమిపేంత విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి శ్రమ అభినందనీయమన్నారు. ప్రజలందరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని,వస్తువులను కొనడానికి బయటకు వెళ్ళేటప్పుడు వారి ప్రయాణంలో పర్యావరణహితమైన సంచులను భాగం చేసుకోవాలని తద్వారా మనం కాలుష్యాన్ని తగ్గించే దిశలో ప్రయాణిస్తామని తెలిపారు. అనంతరం కమీషనర్ ధ్యానచంద్ర,మేయర్ భాగ్యలక్ష్మిలు పూల వ్యాపారి వద్ద కెళ్ళి పూలు కొనుగోలు చేసి పర్యావరణహితమైన సంచులలో వేసుకొని ప్రజలు కూడ ఇలాగే పర్యావరణహితమైన వస్తువులను వాడాలని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంధంగా వచ్చిన వన్ ఎర్త్ వన్ లైఫ్ వారు పెట్టిన ప్రత్యేక స్టాల్‌ను వీక్షించారు. ప్రజలు ఇంటి వద్దనే ఎరువులు తయారుచేసే విధానంలో వారు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహదేవ్ అప్పాజీ,మరుపిళ్ళ రాజేష్,బోయి సత్యబాబు,అడిషనల్ కమీషనర్ ప్రాజెక్ట్స్ డాక్టర్ డి.చంద్రశేఖర్,చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌విప్రసాద్,ఇంఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు,డిప్యూటీ కమీషనర్ రెవిన్యూ జి.సృజన,జోనల్ కమీషనర్ రమ్య కీర్తన,సూపరింటెండింగ్ ఇంజనీర్లు పి.సత్యన్నారాయణ,పి.సత్యకుమారి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత,అసిస్టెంట్ ఎగ్జామినేటర్ ఆఫ్ అక్కౌంట్స్ సుబ్బారెడ్డి,వన్ ఎర్త్ వన్ లైఫ్ అడ్మిన్ లీలాకుమారి బృందం తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల మనుగడకు ముప్పు కలిగించే ప్లాస్టిక్‌ను వాడవద్దు : ఎమ్మెల్యే రాజగోపాల్

**జగ్గయ్యపేట, మార్చి 15, ప్రభాతవార్త :** పర్యావరణను కాపాడుకునేందుకు, భవిష్యత్ తరాల మనుగడకు ముప్పు కలిగించే ప్లాస్టిక్‌ను వాడకూడదని ప్రభుత్వం కూడా ఈదిశగా పర్యావరణ పరిరక్షణ ఆకాంక్షిస్తూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను చేపడుతోందని స్థానిక ఎంఎల్‌ఏ, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీని ఎంఎల్‌ఏ రాజగోపాల్ ప్రారంభించగా, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొని ప్లాస్టిక్ వాడకం ద్వారా వాటిల్లుతున్న సామాజిక నష్టాల గురించి అవగాహన కలిగించారు. కమిషనర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ఆకాంక్షిస్తూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పెద్ది మనోహర్, టిడిపి నేత కొఠారు సత్యనారాయణప్రసాదు, రాధా, కౌన్సిలర్లు కనె ్నబోయిన రామలక్ష్మి ్మ, సంగెపు బుజ్జిబాబు, గొట్టే నాగరాజు, నకిరికంటి వెంకట్, పేరం సైదేశ్వరరావు, నేతలు మల్లెల కొండయ్య, వేదులపురి సైదా, దువ్వల రామకృష్ణ, కాటగాని నరసింహారావు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



**సిటీ సెంట్రల్ స్కూలు బ్రోచర్ ఆవిష్కరణ :** జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్‌లో ఏర్పాటుచేస్తున్న సిటీ సెంట్రల్ స్కూలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. విశ్రాంత ఎస్‌జిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాముల ఈశ్వరయ్యశెట్టి ఆధ్వర్యంలో నెలకొల్పుతున్న సిటీ సెంట్రల్ స్కూలు బ్రోచర్‌ను ఎంఎల్‌ఏ రాజగోపాల్, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆవిష్కరించారు. అనంతరం ఈనెల 17వ తేదీ నుండి జరుగనున్న 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు కలాలు, అట్టలను ఎంఎల్‌ఏ రాజగోపాల్ చేతుల మీదుగా పంపిణీచేశారు.

**సదరన్ రీ వెరిఫికేషన్ క్యాంప్ పరిశీలన:** పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శనివారం నిర్వహించిన సదరన్ రీ వెరిఫికేషన్ క్యాంప్‌ను ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. దివ్యాంగులకు తానే స్వయంగా అల్పాహారాన్ని అందజేసి వారికి గల సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరారు. అనంతరం వైద్యాధికారులతో సంప్రదించి అర్హులైన వారందరికి లబ్ధి జరిగేలా చూడాలని సూచించారు. రీ-వెరిఫికేషన్ సందర్భంగా ఏర్పాటుచేసిన టెంట్, కుర్చీలు, మంచినీటి సదుపాయాలను కల్పించారు.

## రైతుబజార్‌నందు శుభ్రత, పరిశుభ్రత



**తిరువూరు, మార్చి 15, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు లో రైతుబజార్‌నందు శుభ్రత పరిశుభ్రత కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో రైతుబజార్‌లో చెత్త ఊడిచి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈడే మధుబాబు, గాడిచర్ల మారేశ్వరరావు, రైతుబజార్ షాప్ నిర్వాహకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఇ చెక్కుల పంపిణీ

**తిరువూరు, మార్చి 15, ప్రభాతవార్త :** తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యుని కార్యాలయం వద్ద శనివారం సిఎం ఆర్ఇ చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నియోజకవర్గంలోని 66 మంది లబ్దిదారులకు రు.44లక్షల విలువైన చెక్కులను అందించారు.



## అమృత విశ్వ విద్యాపీఠంకు మొదటి బహుమతి

**విజయవాడ, మార్చి 15, ప్రభాతవార్త :** అమృత విశ్వ విద్యాపీఠం, అమరావతి క్యాంపస్ విద్యార్థులు డికోడెక్స్ 2025 24గంటల హ్యాకథాన్‌లో మొదటి బహుమతిని అందుకున్నారు. ముంబాయిలో ఫిబ్రవరి 14, 15 తేదీల్లో జరిగిన 24 గంటల పోటీల్లో ప్రజ్వల యడ్లపల్లి, నాయుడు యశ్వంత్ రెడ్డి, పరిస శ్రీ వత్సల్‌లు అసాధారణ వినూత్న విశ్లేషణాత్మక నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాలేజ్ డైరెక్టర్ ఎంఎస్ విజయేంద్ర మరియు అమృత స్కూల్‌ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ డా సికె జయశంకర్, వారి బృందం విజేతలకు అభినందనలు తెలిపారు.




## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రాజారోగ్యానికి, పర్యావరణానికి పెను ప్రమాదం

**గుంటూరు తూర్పు,మార్చి15,ప్రభాతవార్త :** పజారోగ్యానికి, పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని సంపూర్ణంగా నిషేధించడంలో ప్రభుత్వానికి ప్రజలు సహకరిం చాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జీఎంసి ఆధ్వర్యంలో కాకాని రోడ్ వై జంక్షన్ దగ్గర జరిగిన జాతీయ రహదారి పరిశుభ్ర కార్యక్రమంలో కేంద్ర మంత్రి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు ఎంఎల్ఏ నసీర్ అహ్మద్, ఏపిఐడిసి చైర్మన్ డేగల ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, జీఎంసి డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రజారోగ్యానికి అత్యంత ప్రమాదకరంగా మారిందని, ప్రజలు, ప్రభుత్వం సంయుక్త కార్యాచరణ ద్వారానే దీనిని అడ్డుకోగలమన్నారు. స్వచ్ఛమైన భూగర్భ జలాలను కూడా ప్లాస్టిక్ భూతం కలుషితం చేస్తుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా తమ ప్రచార, సభల్లో ప్లాస్టిక్ వినియోగం నిషేధించుకొని ఆదర్శంగా ఉండాల్సి న ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. ప్రతి ఇంటిలో, కమర్షియల్ సంస్థల్లో డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవడం, ప్రజారోగ్య కార్మికులు సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డ్ కి తరలించి, ప్రాసెస్ చేయడం ద్వారా గుంటూరు నగరాన్ని క్లీన్ నగరంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. నగర కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 3 శనివారం ఒక థీమ్ తో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై ప్రజలకు అవగాహన కల్గించాలని నినాదం ఇచ్చారన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై ఇప్పటికే జీఎంసి ఏప్రిల్ 1 నుండి సంపూర్ణంగా అమలు చేయడానికి కార్యాచరణ సిద్దం చేశామన్నారు. జాతీయ రహదారి వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా ప్రణాళికాబద్దంగా శుభ్రం చేస్తున్నామని తెలిపారు. నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టామన్నారు.తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యాన్సర్ వ్యాధికి కారకం అవుతుందని ప్రజలు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని, ప్లాస్టిక్ వినియోగం వలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, విద్యార్థులు ప్లాస్టిక్ ప్రమాదంపై అవగాహన కల్గి ఉండాలన్నారు. స్వచ్ఛతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. మొక్కల పెంపకం, పర్యావరణహిత వస్తువుల వినియోగంపై ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి, జాతీయ రహదారి వెంబడి వ్యర్థాలను వారితో కలిసి శుభ్రం చేశారు. ఆటోనగర్ నుండి అగతవరప్పాడు డొంకను పరిశీలించి, గడ్డిపాడు రైల్వే గేటుకు ప్రత్యామ్నాయ రహదారిగా ఉంటుందని, రోడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జీఎంసి ఎస్ఈని ఆదేశించారు. అలాగే బొంగరాలబీడు కార్మిక శాఖ స్థలాన్ని పరిశీలించి, ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని, తదుపరి చర్యలపై అధికారులకు సూచించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు రిహాన పఠాన్, ముప్పవరపు భారతి, పి.సమత, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, భాష్యం రామక్రిష్ణ, సిమ్స్ భరత్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చి దిద్దాలి

### -బొల్లిపోగు చిట్టిబాబు

**ఎ కొండూరు, మార్చి 15, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం పోలిశెట్టిపాడు గ్రామ పంచాయితీ సర్పంచ్ బొల్లిపోగు చిట్టిబాబు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక జడ్‌పి హైస్కూల్ వద్ద సర్పంచ్ చిట్టిబాబు పా ్లస్టిక్ రహిత గ్రామంలో ఏ విధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ



సందర్భంగా సర్పంచ్ చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామంలో వున్న ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతతో పాటు, వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఇళ్ళలోని చెత్తను రోడ్లుపై పారేయకుండా ప్రతి ఒక్కరు తడిచెత్త, పొడిచెత్తకు పంచాయితీ అధికారులు అందించిన డబ్బాలో వేసి వీధులను గ్రామాన్ని చెత్తరహిత గ్రామంగా తీర్చిదిద్దాలను సర్పంచ్ చిట్టిబాబు కోరారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక వల్ల చాలా అనర్థాలున్నాయని, గ్రామాల్లో వాడకూడదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వీరబాబు, ఆశావర్కర్లు, వి.ఓ.లు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**- చీమలపాడులో...:**

చీమలపాడు గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర క్యాక్రమాన్ని పంచాయితీ సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు, గ్రామపంచాయితీ సెక్రటరీ బి గోపీకృష్ణ, విఏవోలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ముగిసిన ఇంటర్ పరీక్షలు

### -ద్వితీయ ఇంటర్‌కు 28 901మంది విద్యార్థులు హాజరు

**గుంటూరు విద్య,మార్చి 15,ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 29405మందికి గాను 28901మంది హాజరయ్యారు. 503మంది గైరా ్హజరయ్యారు.జనరల్‌కోర్సులకు 28854 మందికిగాను 28440మంది హాజరయ్యారు. 413మంది గైర్హాజరయ్యారు.ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 551మందికి గాను 461మంది హాజరయ్యారు.90మంది గైర్హాజరయ్యారు .మొత్తంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎక్కడా కూడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆర్‌ఐఓ జీకె జుబేర్ తెలిపారు.

## ట్రక్‌డ్రైవర్లకు హెచ్‌డిబిఎస్ ట్రాన్స్‌పోర్ట్ ఆరోగ్యకేంద్రం

**విజయవాడ, మార్చి 15, ప్రభాతవార్త :** విజయవాడలో మమతా హెల్త్ ఇన్సిట్యూట్ ఫర్ మదర్ అండ్ చైల్డ్ సహకారంతో తమ 8వ ట్రాన్స్‌పోర్ట్ ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభించామని హెచ్‌డిబిఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రతినిధులు ప్రకటించారు. మస్క్యులోస్కెలెటల్ రుగ్మతలు, దీర్ఘకాలిక వెన్ను, కాళ్ళ నొప్పులు వంటి ఇతర శారీరక సమస్యలెదుర్కొనే డ్రైవర్ల జీవితాలను మెరుగుపరిచే ఉద్దేశ్యంతో తాము చొరవ తీసుకుని ఈ ఆరోగ్యకేంద్రం ప్రారంభించామన్నారు.

## శిశుచర్మ సంరక్షణలో జాన్సన్ బేబీస్ విశిష్టత తెలుసుకున్న మాతృమూర్తులు

**విజయవాడ, మార్చి 15, ప్రభాతవార్త :** శిశు చర్మ సంరక్షణకోసం జాన్సన్ బేబీస్ వినూత ్న ఫార్ములేషన్స్ విశిష్టతను 2వేల మంది మాతృమూర్తులు తెలుసుకున్నారని జాన్సన్ బేబీస్ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఒండర్ లాబ్స్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో స్వయంగా, వర్చువల్‌గా పాల్గొన్న మాతృమూర్తులు జాన్సన్ బేబీస్ ఉత్పత్తుల గురించి డా సగుల్ రామానుజ ముగునాథన్ ద్వారా తెలుసుకున్నారన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

## విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

**మంగళగిరి,మార్చి 15,ప్రభాతవార్త :** పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని,ప్రజలు తనపై బాధ్యత పెట్టారని, అందరం కలిసికట్టుగా మంగళగిరిని అభివృద్ధి చేసుకుందా మని విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ఆల్ఫా టీ స్టాల్‌వద్ద పారిశుద్ధ్య కార్మికులతో మంత్రి నారా లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజ లంతా నిద్రపోయే సమయానికి పారిశుద్ధ్యం నిర్వహణలో గడిచిన 10నెలల్లో మంగళగిరిలో మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. ప్రజల్లో కూడా చైతన్యం తీసుకొచ్చి రోడ్లపై చెత్తవేయకుండా చూడాలి పారిశుద్ధ్యం,స్వచ్ఛతలో దేశంలోని అన్ని కార్పొరేషన్లలో మంగళగిరిని నెం.1గా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.ఇందుకు పారిశుద్ధ్య కార్మికులతో పాటు ప్రజలు కూడా సహకరించాలి.ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని వారిని కూడా భాగస్వామ్యం చేయాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన పారిశుద్ధ్యం నిర్వహణకు అవసరమైన సామాగ్రిని కూడా రూ.90లక్షలు వెచ్చించి అందుబాటులో ఉంచాం.



**-పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం.**

ముఖాముఖిలో పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అడిగి తెలుసుకున్నారు.రాజధాని ప్రాంతం కావడంతో జనాభా పెరిగిందని,కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు.వాహనాల సంఖ్యను పెంచాలని విజ్ఞప్తిచేశారు.కార్మికులు,వాహనాల సంఖ్య పెంచుతామని మంత్రి హామీ ఇచ్చారు.ప్రభుత్వ పథకాలు అందడం లేదని పలువురు కార్మికులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.దీనిపై మంత్రి స్పందిస్తూ గతంలో ఆప్కాస్ ద్వారా గందరగోళం సృష్టించారని,ఇప్పుడు కార్పొరేషన్‌లో విలీనంతో సమస్యఉండదని,ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మహిళా పారిశుద్ధ్య కార్మికులకు మరుగుదొడ్ల సౌకర్యం,కార్మికులకు ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని,ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని,ఐడీ కార్డులు ఇవ్వాలని కోరారు.మంగళగిరిలో మొదటి విడతలో 6మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని,భూగర్భ డ్రైనేజీ,అండర్‌వాటర్ పైప్ లైన్ నిర్మిస్తామని,జూన్ నాటికి పనులు ప్రారంభించి ఏడాదిన్నరలో పూర్తిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.భూగర్భ గ్యాస్ పవర్ కూడా అందిస్తాం,పారిశుద్ధ్యం నిర్వహణను స్ట్రీమ్‌లైన్ చేస్తామన్నారు.

**ఇళ్ళు లేని వారికి ఇళ్ళు నిర్మించి ఇస్తాం :** మంగళగిరిలో త్వరలో పట్టాలు పంపిణీ చేస్తాం...11వేల మందిని అర్హులుగా గుర్తించాం.ఇళ్ల పట్టాలు అందించిన తర్వాత ఇల్లు లేనివారికి ఇళ్ళు నిర్మించి ఇస్తాం.టిడ్కో ఇళ్ళ సముదాయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం .కమ్యూనిటీ భవనాలు,పార్కులు,చెరువులు అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ సంజీవని ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు వైద్యం అందిస్తాం..ఆవులు, శునకాలు,పందుల సమస్యను పరిష్కరిస్తాం,వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.అన్ని రంగాల్లో మంగళగిరిని నెం.1 గా తీర్చిదిద్దుతాం.గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ మెజార్టీతో గెలిపించారు.ప్రజలు నాపై బాధ్యత పెట్టారు.అందరూ కలిసికట్టుగా మంగళగిరిని అభివృద్ధి చేసుకుందాం.స్వర్ణకారులకు అండగా ఉంటాం.అమరావతి నిర్మాణ పనులు ఏప్రిల్ నుండి మొదలుపెడతాం. గంజాయి నియంత్రణకు యుద్ధమే చేస్తున్నామని చెప్పారు.6నెలలకు ఒకసారి సమావేశమై మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని భరోసా ఇచ్చారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను మంత్రి లోకేష్ సత్కరించారు. అందరితో కలిసి ఫోటోలు దిగారు.సామాన్యుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, మార్చి 15,ప్రభాతవార్త:** పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా ఆసుపత్రి వైద్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశించారు. నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిని శనివారం ఆయన సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యాధికారి డాక్టర్ పిరోజ్‌ఖాన్‌ను అడిగి తెలుసుకొన్నారు. ప్రతి నిత్యం ఎంత మంది పేషెంట్లు వస్తున్నారు. ఇన్‌పేషెంట్లు ఎంత మంది ఉంటున్నారు. ఔట్ పేషెంట్లు ఎంత మంది ఉంటున్నారు. వీరికి అవసరమైన మందులు అందిస్తున్నారా? లేదా అనే విషయాలను పరిశీలించారు. వైద్యశాల మొత్తం కలియతిరిగారు. వైద్యశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేవిధంగా చూడాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మేలైన వైద్యసేవలను అందించాలన్నారు. వైద్యశాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి వైద్యులను అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, నాయకులు బండ్లమూడి బాబూరావు, చెన్నుపాటి భాస్కర్, ఆరె ప్రసాద్, గరిగంటి సాయిబాబు, గురు బాలు, షేక్ కరిముల్లా తదితరులున్నారు.



## కారంపూడి మండలంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర

**కారంపూడి, మార్చి 13 ప్రభాతవార్త:** కారంపూడి మండలంలోని పలు గ్రామాల్లో ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర



కార్యక్రమాలను నిర్వహించారు. కారంపూడిలోని ఎస్‌డబ్ల్యూసీపీ షెడ్డు వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు సర్పంచ్ బాణావత్ సరస్వతిబాయి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా నీటి యాజమాన్య ప్రాజెక్టు డైరెక్టర్ బూసిరెడ్డి, ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్‌డీ కసిన్యానాయక్, గ్రామపెద్దలు బాలునాయక్, కటికల బాలకృష్ణ తదితరులు ప్రసంగించారు. గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధిస్తూ తీర్మానించారు. స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీలో ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ రవికుమార్, మండల ప్రత్యేకాధికారి బూసిరెడ్డి, ఏపీఓ కోటిరెడ్డి, సీహెచ్ఓ మల్లయ్య, లాలూనాయక్, ఉపాధ్యాయులు సువర్ణరాజు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, బాలింతలకు పౌష్టికాహారం పంచారు. కూరగాయల మార్కెట్ సెంటర్లో, స్థానిక వీర్లదేవాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాలను ఈఓపీఆర్‌డీ కసిన్యానాయక్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు పర్యవేక్షించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

**పెదకూరపాడు, మార్చి 15 ప్రభాతవార్త :** మండలంలోని 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 7వ తరగతి విద్యార్థిని కె.దివ్యశ్రీ ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో అద్భుత ప్రతిభను ప్రదర్శించింది. దివ్యశ్రీకి నరసరావుపేట శంకరభారతీపురం పాఠశాలలో జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో ఉపాధ్యాయులు, అధికారులు నగదు బహుమతిని, మెమోంటోను అందుకున్నారు. దివ్యశ్రీకి శిక్షణ అందించిన ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, రమేష్‌లను హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఛైర్మన్ పున్నారావులు అభినందించారు.



## పి4 సర్వే వేగవంతం చేయాలి : ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు

పొన్నూరు, మార్చి 15,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పీ4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు ఆదేశించారు. సర్వే జరుగుతున్న తీరును శనివారం ఆయన కట్టెంపూడి గ్రామంలో పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సర్వేకి ప్రజలు కూడా సహకరించి సిబ్బంది అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సర్వే ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజల అవసరాలను తీర్చేందుకే ప్రభుత్వం ఈ సర్వేను తీసుకొచ్చిందన్నారు. సర్వేపై ఎలాంటి అపోహలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎంపిడిఓ వెంట ఈఓపిఆర్డీ కామరాజుగడ్డ సాయి మల్లికార్జునరావు, పంచాయితీ కార్యదర్శి సాయి నవీన్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట జంగా సుధారాణి తదితరులున్నారు.

## కె.జి.బి.వి.పాఠశాలలో విద్యార్థులకు అవగాహన

**నరసరావుపేట, మార్చి 15 ప్రభాతవార్త :** మానసిక ఆరోగ్యం - బాలికల స్థిర అభివృద్ధికి మార్గం అనే అంశంపై కె.జి.బి.వి. పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని 24 కె.జి.బి.వి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పిఈటిలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. కె.జి.బి.వి. సెక్రటరీ డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయినులే బాలికల తల్లిదండ్రులుగా పాత్ర పోషించాలన్నారు. బాలికలలో ఉండే మానసిక ఒత్తిడి నియంత్రణకు కౌన్సిలింగ్ చేయాలన్నారు. సోమవారం నుండి జరగబోయే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధంగా ఉంచాలని, వారిపై ఒత్తిడి లేకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి టి.వి. సుబ్బారావు, జి.సి.డి.ఓ. రేవతి, కౌన్సిలర్స్ అశోక్, ప్రేమకుమార్, శాంతివర్ధన్, యూసఫ్, ఫణీంద్రకుమార్‌లు ఉన్నారు.



## ఓక్లాండ్ వార్షికోత్సవ వేడుకలు

**నరసరావుపేట, మార్చి 15 ప్రభాతవార్త :** పట్టణంలోని ఓక్లాండ్ పాఠశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ చదలవాడ ఆదిత్య, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ రామినేని సుధీర్, ప్రముఖ కవి బి.మాధవరావు, ఓక్లాండ్ స్కూల్ ఛైర్మన్ కంకణంపాటి హనుమంతరావు, డాక్టర్ కంకణంపాటి భారతీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు చదువుకోవాలన్నారు. క్రమశిక్షణ, సమయపాలన పాటించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోటీలలో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు.

## సాంకేతికతను రైతుల వద్దకు తీసుకెళ్ళాలి

### -డాక్టర్ చెరుకుపల్లి శ్రీనివాసరావు

**పొన్నూరు, మార్చి 15,ప్రభాతవార్త:** పరిశోధనల్లో అభివృద్ధి అయిన సాంకేతికతను వ్యవహారికంగా రైతుల వద్దకు తీసుకెళ్ళాలని న్యూఢిల్లీ ఐకార్-ఐఏఆర్ఐ(ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) డైరెక్టర్, వైస్ చాన్సలర్



డాక్టర్ చెరుకుపల్లి శ్రీనివాసరావు అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం అకడమియా ఇండస్ట్రీ ఫార్మర్ పార్టనర్‌షిప్స్ కాన్‌క్లేవ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెరుకుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగ్గ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడం, అకడెమియా ఇండస్ట్రీ ఫార్మర్ మధ్య సహకారాన్ని బలపరచాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి సాంకేతికత, పరిశోధన, పరిశ్రమలు, రైతుల మధ్య భాగస్వామ్యం కీలకమని అభిప్రాయపడ్డారు. పరిశ్రమలు తమ అవసరాలకు అకడెమిక్ సంస్థలకు తెలియజేస్తే, విద్యా సంస్థలు తగిన పరిశోధనలు చేపట్టి రైతులకు అవసరమైన పరిష్కారాలను అందించగలమని పేర్కొన్నారు. మరో అతిథి రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి భాగస్వామ్య వేదిక రైతులకు నూతన మార్కెట్ అవకాశాలను కల్పించడంతోపాటు, అధునాతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచే అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ విజయగాథలను పంచుకుంటూ, పరిశ్రమలతో భాగస్వామ్యం వల్ల ఉత్పత్తి విలువ ఎలా పెరిగిందో వివరించారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆలపాటి సత్యనారాయణ, ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సీ. తారా సత్యవతి, రాజమండ్రి సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్, పెదవేగిలోని ఐఐఓపీఆర్ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసి పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయంతం చేయాలి

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, మార్చి 15,ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్ళేందుకు కూటమి ప్రభుత్వం శక్తివంచన లేకుండా పని చేస్తోందని, ఇందుకు ప్రజలందరూ సహకరించాలని



ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కోరారు. మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు భారీ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెల మూడో శనివారం ఏదో ఒక థీముతో ముందుకు సాగుతుందన్నారు. అందులో భాగంగా ఈ శనివారం సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధానికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజలు కూడా తమ వంతుగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా చెత్తా చెదారాలను కూడా కాలువల్లో, రోడ్లపై వేయకూడదన్నారు. స్వర్ణపురి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. దాతలు కూడా ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని ముందకు తీసుకెళ్ళాలన్నారు. కారుమూరి శివశంకరారవు ముందుకు వచ్చి జూట్ క్యారీ బాగులు ఉచిత పంపిణీ చేయించేదుకు రూ.5వేలు మునిసిపల్ కార్యాలయానికి ఈ కార్యక్రమ నిర్వహణకు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, కూటమి నాయకులు వడ్రాణం మార్కెండేయబాబు, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, ఆకుల సాంబశివరావు, రోటరీక్లబ్ సభ్యులు బండారుపల్లి శ్రీనివాసరావు, యాసం వీరయ్య తదితరులున్నారు.

## సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,మార్చి15,ప్రభాతవార్త: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలంటే అధికారులు



స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మాజీమంత్రి స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం మున్సిపల్‌కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పాల్గొని ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు, పట్టణంలో వివిద వార్డుల నుంచి వచ్చిన ప్రజలతోఎమ్మెల్యే ప్రత్తిపాటి నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కార దిశగా అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడారు. స్థానిక కౌన్సిలర్‌లు, అధికారులు పర్యటించి ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. శివారు కాలనీలకు కూడా త్రాగునీరు అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీధి కుక్కలను పట్టి జనావాసాలకు దూరంగా పెట్టాలన్నారు. టిడ్కో ఇళ్ళ సముదాయంలో ప్రార్ధనా మందిరాలకు నిర్మాణానికి అవసరమైన స్ధలాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫానీ, కమీషనర్ శ్రీహరి బాబు, టిడిపి నాయకులు షేక్ కరి ముల్లా, పటాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, అమరారమాదేవి, మున్సిపల్ డి.ఈ.రహీమ్, మున్సిపల్‌కౌన్సిలర్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అయోడిన్ లోపాన్ని అధిగమిద్దాం

**రెంటచింతల, మార్చి 15 ప్రభాతవార్త:** శరీరంగా ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలు చాలా కీలకమని, పోషకాల సమతుల్యం లేకుంటే పలు అనారోగ్య సమస్యలు వెంటాడుతాయని



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రెంటచింతలలోని ఆంజనేయ మాన్యంలోని ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలలో అయోడిన్ సర్వేలో భాగంగా పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అయోడిన్ లోపంతో బాధపడుతున్న తొమ్మిది మంది విద్యార్థులను గుర్తించి వారి శాంపుల్స్ ల్యాబ్‌కు పంపినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోడిన్ లోపంతో ఉత్పన్నమయ్యే దుష్పరిణామాలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరించారు. కీలక పోషకాల లేమితో అనారోగ్యానికి గురయ్యే వారికి మందులు, సప్లిమెంట్లతో లోపాలను సరిచేయవచ్చన్నారు. అయితే కేవలం మందులపైనే ఆధారపడకుండా మెరుగైన జీవనశైలి, ఆహారంతో పోషకాహార లేమిని అధిగమించవచ్చన్నారు. అయోడిన్ లోపం జీర్ణవ్యవస్థ నుంచి చర్మం వరకూ శరీర భాగాలు అన్నింటిని ప్రభావితం చేస్తుందన్నారు. జుట్టు ఊడిపోవడం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అయోడిన్ లోపంతో బాధపడేవారు గుడ్లు, పాలు, చికెన్, బీఫ్‌లివర్, అయోడైజ్డ్, టేబుల్ సాల్ట్ వంటి ఆహార పదార్థాలు తగినంతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, మౌనిక, మేరీ, ప్రశాంతి, మార్తమ్మ, సౌభాగ్యవతి, మహేష్‌బాబు, ఖాసింషా తదితర ఆసుపత్రి సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేపలు అమ్ముకొని జీవనం సాగిస్తున్న వారిపై దాడులు

**సత్తెనపల్లి, మార్చి 15 ప్రభాతవార్త :** పట్టణంలోని 23వ వార్డులో చేపలు అమ్ముకుంటూ 20 కుటుంబాల వారు నివసిస్తున్నారు. అదే వార్డుకు చెందిన హుస్సేన్ జానీ అనే మహిళ, వారి కుమారులు తరచూ వారిపై దుర్భాషలాడుతూ ఇబ్బంది కలిగిస్తున్నారు. దీంతో పది కుటుంబాల వారు అక్కడి నుండి వేరొక ప్రాంతానికి తరలివెళ్ళేందుకు



మెటీరియల్‌ను తరలిస్తున్నారు. ఈ సమయంలో లారీ అటుగా రావద్దంటూ లారీ డ్రైవర్‌ను అకారణంగా హుస్సేన్ జానీ, ఆమె కుమారులు దాడి చేశారు. చేపలను అమ్ముకోనివ్వమంటూ దౌర్జన్యం చేశారు. దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. సంఘం నాయకులు శివయ్య మాట్లాడుతూ చేపలు అమ్ముకొని జీవనం సాగించేవారిని తక్కువ చేసి దుర్భాషలాడటం సరికాదన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## కృష్ణవేణి డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

**నరసరావుపేట టౌన్, మార్చి 15 ప్రభాతవార్త :** కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. వివరాలను శనివారం విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఫస్ట్‌సోర్స్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో బృంద చర్చ, టెక్నికల్ రౌండ్‌లలో మొత్తం 49 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు ఉద్యోగ కల్పన తమ ధ్యేయమన్నారు. అభినందన కార్యక్రమంలో అధ్యాపకులు యోగేశ్వరరావు, బాలకోటేశ్వరరావు, శివన్నారాయణ పాల్గొన్నారు.

## కెఎల్‌యులో కోడింగ్ టెక్నాలజీ పైన ఒకరోజు కార్యశాల


**తాడేపల్లి,మార్చి 15,ప్రభాతవార్త :** కెఎల్‌యు డీమ్డ్ యూనివర్సిటీలోస్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రాంప్టో వెంచర్ క్లబ్ ద్వారా న్యూ సెమినార్ హాల్లో కోడింగ్ టెక్నాలజీపై ఒక రోజు కారయశాలను విజయవంతంగా నిర్వహించారు. కారయశాలకు ప్రముఖ కోడింగ్ నిపుణులు (యూట్యూబర్) సాయి శంకర కేశవానంద పండా (నాందేడ్,మహారాష్ట్ర) ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు కోడింగ్ టెక్నాలజీ పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ కోడింగ్ ప్రోగ్రామింగ్,పైథాన్,జావా సిప్లస్‌ప్లస్, జావాస్క్రిప్ట్ వంటి పలు రకాల కోడింగ్‌ల ప్రాముఖ్యత గురించి వివరించారు.ప్రాక్టికల్ సెషనలో విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు,.




టెక్నాలజి రంగంలో కొత్త అవకాశాలను వినియోగించుకోవడానికి ఈ కార్యక్రమం విద్యార్థులకు గొప్ప అవకాశం కల్పించిందని సాక్ డైరెక్టర్ సాయి విజయ్ అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోడింగ్ నైపుణ్యాలను మెరుగుపరిచి టెక్నాలజీ రంగంలో కొత్త అవకాశలు సృష్టించడమే ఈ కార్యశాల ప్రధాన లక్ష్యమన్నారు.కార్యక్రమాన్ని విజయవంతంగా జరపడానికి విశేషంగా సహకరించిన యూనివర్సిటీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలను కొనసాగిస్తామని క్లబ్ ఆర్గనైజర్ కృష్ణసాయి తెలిపారు.కార్యక్రమానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.రాంబాబు సారధ్యం వహించారు.కార్యక్రమం నిర్వహించినందుకు వాలంటీర్లను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ,ప్రొఫెసర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు,డాక్టర్ ఎన్.వెంకట్రామ్,డీన్ డాక్టర్ కెఆర్ఎస్‌ప్రసాద్,సాక్ డైరెక్టర్ సాయి విజయ్ తదితరులు అభినందించారు.

## సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీ

**నరసరావుపేట టౌన్, మార్చి 15 ప్రభాతవార్త :** సిపిఐ ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ఇళ్ళ స్థలాలను డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పేదలకు పట్టణాలలో రెండు శెంట్లు, గ్రామాలలో మూడు శెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏడాది కాలం అయిపోయిందని, ఇప్పటికీ పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వలేదన్నారు. ఇళ్ళ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారని, అది



జరగలేదన్నారు. సూపర్‌సిక్స్ హామీలలో ఏ ఒక్కటి ప్రజలకు అందలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. సిపిఐ నాయకులు మారుతీవరప్రసాద , షేక్.హుస్సేన్, కాసా రాంబాబు, ఉలవలపూడి రాము, వైదన వెంకట్, పవన్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, సుబ్బారావు, నాగరాజు, నాగమణి, రామారావు, బాబూరావు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రతిభా పారితోషకాలకు ఎంపికైన కెరిడ్జ్ విద్యార్థులు

**నరసరావుపేట, మార్చి 15 ప్రభాతవార్త :** కెరిడ్జ్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ప్రతిభా పారితోషకాలను అందుకున్నారు. రేడియో, టీవీ ఛానల్స్‌లో ఆరు ఫారెన్ భాషలలో ప్రతిభ చూపి భారతదేశంలోనే తమ విద్యార్థులు గుర్తింపును తెచ్చుకున్నారన్నారు. ఇండియాలో ఆరు విదేశీ భాషల్లో శిక్షణ ఇచ్చే ఏకైక స్కూల్ తమ పాఠశాల అన్నారు. ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, టాలియన్, ఇంగ్లీష్, జపనీస్ వంటి భాషల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రసార భారతీ ద్వారా పారితోషకాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లుతో పాటు ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్

**కారంపూడి, మార్చి 13 ప్రభాతవార్త:** పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కారంపూడి తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. కారంపూడి పట్టణంలో తహశీల్దారు ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛదివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ప్రజలు తాము నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీధులను శుభ్రంగా ఉంచాలని కోరారు. అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్ఐ వేముల శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అయోడిన్ లోపంపై అవగాహన సదస్సు

**కారంపూడి, మార్చి 13 ప్రభాతవార్త:** నేషనల్ అయోడిన్ డిఫిషియన్సీ డిజార్డర్స్ కార్యక్రమం సందర్భంగా స్థానిక మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు కారంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డా॥ ఎం.రమ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అయోడిన్ లోపాన్ని గుర్తించారు. అయోడైజ్డ్ సాల్ట్ ప్యాకెట్లు వాడమని సూచించారు. అయోడిన్ లోపంతో వచ్చే సమస్యలు వివరించారు. గాయటర్, మానసిక వైకలనయం రాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పుల్లమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు కె.మల్లయ్య, పీఎల్ మస్తాన్‌వలి, ఆరోగ్య సహాయకులు, జి.ఈశ్వరి, లాలునాయక్, వెంకటమణి, ఆశ కార్యకర్తలు, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ బూసిరెడ్డి, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కారంపూడి, మార్చి 13 ప్రభాతవార్త: కారంపూడి మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నయోమి తెలిపారు. ఈ నెల 17 నుంచి మే నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెలాఖరుకు గడువు ముగుస్తుందని తెలిపారు. వివరాలకు 9441422431 ఫోన్‌నంబర్లో సంప్రదించాలన్నారు.

